RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ సంపుటి : 4, సంచిక : 39 | బుధవారం జనవరి 14, 2026 | పేజీలు : 6 వెల : రూ.3-00



3లో.. కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

# పునర్విభజన చిచ్చు!




## 33 జిల్లాల లెక్క తేల్చేస్తామంటున్న సీఎం

- గత ప్రభుత్వం హడావుడిగా విభజించిందన్న రేవంత్
- జ్యుడీషియల్ కమిషన్ వేస్తామని ప్రకటన
- జిల్లాల సంఖ్య తగ్గిస్తే అగ్గి రాజేస్తామంటున్న బీఆర్ఎస్
- కేసీఆర్ మార్క్ చెరిపేందుకే అని ఫైర్
- ప్రాంతీయ నేతల బలాన్ని దెబ్బతీసే కుట్ర అని విమర్శలు
- లోకల్ స్టేటస్ మార్పు.. నోటిఫికేషన్లు లేటవుతాయని విద్యార్థుల్లో టెన్షన్
- సీఎం ప్రకటనతో తెలంగాణలో మళ్లీ రాజకీయ అలజడి

3లో..

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయ భౌగోళిక చిత్రం మరోసారి పెను మార్పులకు లోనుకాబోతోందా? గత కొన్ని సంవత్సరాలుగా 33 జిల్లాల పాలనకు అలవాటు పడ్డ రాష్ట్ర యంత్రాంగం, ప్రజలు.. ఇప్పుడు మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లాల్సి వస్తుందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా ప్రకటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ అగ్గిని రాజేసింది. గత ప్రభుత్వం కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం, ఎటువంటి శాస్త్రీయత లేకుండా జిల్లాలను ముక్కలు చేసిందని మండిపడ్డ సీఎం.. వాటిని సరిదిద్దేందుకు ఏకంగా జ్యుడీషియల్ కమిషన్‌ను రంగంలోకి దించుతున్నారు. ఈ ఒక్క నిర్ణయంతో అటు ప్రతిపక్షాలు, ఇటు నిరుద్యోగ వర్గాల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం పొలిటికల్ మైలేజీ కోసమే జిల్లాలను విభజించిందని, దీనివల్ల పాలనా వ్యయం పెరిగిందే తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నది కాంగ్రెస్ సర్కార్ వాదన. అయితే, ఇది కేసీఆర్ ముద్రను చెరిపేసే ప్రయత్నమని, జిల్లాలను తగ్గిస్తే ఊరుకోమని గులాబీ దళం హెచ్చరిస్తోంది. రాజకీయ రచ్చ ఇలా ఉంటే, ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్న నిరుద్యోగుల్లో మాత్రం టెన్షన్ మొదలైంది. జిల్లాల పునర్విభజన పేరుతో నోటిఫికేషన్లను మరికొంత కాలం సాగదీస్తారా? అన్న సందేహం వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.



వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను మంగళవారం ఆవిష్కరిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయూబ్..



వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్ - 2026ను మంగళవారం ఆవిష్కరిస్తున్న వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు




వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను మంగళవారం ప్రసంగి డ్యాన్స్ స్టూడియోలో విద్యార్థులతో కలిసి ఆవిష్కరిస్తున్న ప్రసంగి డ్యాన్స్ స్టూడియో సారథి ప్రసంగి, స్టూడియో ప్రొప్రైటర్ ఎన్. శ్రీలత

## వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం

- ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి దామోదర రాజనర్సింహ



**వేద న్యూస్, హైదరాబాద్:**

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. కోఠి మెడికల్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్తో కలిసి నూతనంగా ఎంపికైన 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్--2లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఆరోగ్య శాఖలో దాదాపు 10 వేల పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరో 10 వేల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వ్యాధుల నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న మంత్రి, నగర వ్యాప్తంగా 145 పాలి క్లినిక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి 35-40 కిలో మీటర్లకు ఒక ట్రామా క్లినిక్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## మహాజాతరకు రికార్డు స్థాయి ఏర్పాట్లు

- రూ.251 కోట్లతో చరిత్రలోనే అతిపెద్ద కేటాయింపు
- 3 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది
- మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- 28 నుంచి 31 వరకు మేడారం జాతర

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఏర్పాట్లు చేస్తోందని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క తెలిపారు. తెలంగాణ సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం వారు ఈ వివరాలను వెల్లడించారు. జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మహాజాతరకు సుమారు 3 కోట్ల

మిగతా 3వ పేజీలో..

# డీసీకి ఏం కాదు..!

- సదరు ఆఫీసర్‌కు అండగా మేమున్నాం
- ఓ ఈవో, ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల భరోసా..!?
- ఎంక్వయిరీని నీరుగారిస్తున్నదెవరు?
- ఆరోపణలొచ్చి నెల దాటుతున్నా చర్యలు శూన్యం!



డీసీపై చర్యలు ఉండేనా...!?

- ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ వర్గాల్లో డిస్కషన్!?
- దేవాదాయ ధర్మదాయ శాఖలో అక్రమాలపై లేఖ కలకలం
- సదరు ఆఫీసర్‌పై చర్యలకు ఉపక్రమించడంలో జాప్యమేలనో?
- ఎంక్వయిరీ ముందుకు సాగుతున్నదో.. లేదోననే చర్చలు

వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:

దేవాదాయ ధర్మదాయ శాఖలో వరంగల్ జోన్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ తీరుపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై మహిళా సిబ్బంది ఉన్నతాధికారులకు రాసిన లేఖ వైరల్ అయింది. ఈ క్రమంలోనే సదరు ఆఫీసర్‌పై ఎంక్వయిరీకి ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. కాగా, సదరు ఆఫీసర్‌పై చర్యలుండేనా? అనే చర్చ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ వర్గాల్లో జరుగుతున్నది. డీసీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే సదరు ఆఫీసర్ వరంగల్ జోన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగినులపై వేధింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లెటర్‌లో మహిళా సిబ్బంది పేర్కొన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన మహిళలను అవమానకరంగా మాట్లాడుతున్నారని, 'ఏమి వస్తది.. ఏమి రాదు' అంటూ హేళన చేస్తున్నారని లేఖలో వారు ఆరోపించారు. కాగా, ఈ ఆరోపణలపై విచారణ తర్వాత సదరు అధికారిపై చర్యలుంటాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకుంటారా? లేదా తూతూ మంత్రంగానే ఎంక్వయిరీ ముందుకు సాగుతున్నదా? అనే సందేహాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

వేద న్యూస్

డీసీపై ఎంక్వయిరీ..!?

'డీసీ' రాజ్యమా?

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ జోన్ దేవాదాయ--ధర్మదాయ శాఖలో మహిళా సిబ్బంది వేధింపుల వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారుతోంది. డీసీపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై జరుగుతున్న విచారణను ఉద్దేశపూర్వకంగా ఓ ఈవోతో పాటు ఇద్దరు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పక్కదారి పట్టిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. 'మేమున్నాము.. మీకు ఏమి కాదు..అన్నీ మేమే చూసుకుంటాం' అంటూ భరోసా ఇచ్చినట్లు సమాచారం. మహిళా ఉద్యోగులపై జరిగిన వేధింపుల విచారణలో కీలకంగా ఉండాల్సిన అధికారులు, బాధితులకే వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

**15 రోజులు గడిచినా చర్యలే లేవు**

విచారణ నిమిత్తం మహిళా సిబ్బందిని పిలిచి ఇప్పటికే 15 రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. విచారణ పూర్తయినప్పటికీ, ఇప్పటివరకు ఎంక్వయిరీ రిపోర్ట్‌ను సమర్పించని విచారణ అధికారి వ్యవహారంపై అనుమానాలు పెరుగుతున్నాయి. ఇది కావాలనే కాలయాపన చేస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**'డీసీకి ఏం కాదు.. మేమున్నాం'**

'విచారణను పక్కదారి పట్టించామని, డీసీకి ఎలాంటి ఇబ్బంది ఉండదని' ఓ ఈవో, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు బహిరంగంగానే చెబుతున్నారన్న ఆరోపణలు శాఖలో కలకలం రేపుతున్నాయి. ఇది అధికార దుర్వినియోగమే కాకుండా, మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రభుత్వ విధానాలకే సవాల్‌గా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై బాధితులు ఆ శాఖ మంత్రిని సైతం కలిసి తమ గూడును వెలిబుచ్చుకున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి.. మహిళా ఉద్యోగులకు న్యాయం జరుగుతుందా..? లేక అధికార దర్పమే గెలుస్తుందా..?

## అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు!

- అదే రేవంత్ ప్రభుత్వ విధానం
- కాంగ్రెస్ నేతల అవినీతిపై సిట్ లేదు.. మీడియాపై మాత్రం దాడులు
- ప్రశ్నించే గొంతుకలను వేధిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారు

3లో..

## కవిత కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారంలో వాస్తవం లేదు

- బీఆర్ఎస్ అవినీతిపై కవిత ఆరోపణలే నిదర్శనం
- సిట్ ఏర్పాటు సరైన నిర్ణయం
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

3లో..

# హెల్మెట్ ప్రాణాలకు రక్షణ కవచం

- నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదాలకు కారణం
- మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
- రోడ్డు భద్రతా నియమాలు అందరూ పాటించాలి
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

హెల్మెట్ ప్రాణాలకు రక్షణ కవచంలాంటిదని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ ఆదేశాల మేరకు 'అరైవ్ అలైవ్ అనే వినూతన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమం జనవరి 13 నుంచి 24 వరకు అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు కూల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతనశెట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని గ్రామస్తులకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా వినియోగించాలని, అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనం నడపడం, భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం కేవలం నినాదంగా కాకుండా ప్రజల జీవితాల్లో ఒక ఉద్యమంలా మారాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలంటే చిన్న నిర్లక్ష్యానికీ తావివ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదే గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనను అతని తల్లిదండ్రులు భావోద్వేగంతో వివరించారు. తమ బాధను కళ్లకు కట్టినట్లుగా చెప్పడంతో అక్కడి గ్రామస్తులంతా చలించిపోయారు. ఈ ఘటన రోడ్డు భద్రత ఎంత ముఖ్యమో మరోసారి గుర్తు చేసింది. చివరగా గ్రామస్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించగా, అనంతరం గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, మెదక్ రూరల్ సీఐ జార్జ్, ఏఎంవీఐ శ్రీనివాస రావు, కూల్చారం ఎస్సై అహమ్మద్ మోహినొద్దీన్, గ్రామ సర్పంచ్ దయాకర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ బాలాజీ నగర్ జంక్షన్ వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏనుమాముల సీఐ జువాజీ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా యువత చెడు మార్గాలకు వెళ్లకుండా మంచి మార్గాల్లో నడుస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలు, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవరుచుకోవాలని, "మత్తు వదిలి మైదానానికి రండి" అంటూ యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, వాహనదారులు, పోలీసు అధికారులు పాల్గొని రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టేక్మాల్‌లో గాలిపటాల పోటీలు

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానంలో స్వామి వివేకానంద యువజన వారోత్సవాల్లో భాగంగా ఫొటో ఫన్ సంస్థ ఆధ్వర్యంలో యువత, చిన్నారుల కోసం గాలిపటాల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ మాట్లాడుతూ.. యువత తమ వ్యక్తిత్వాన్ని స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గాలిపటాల పోటీలు యువతలో ఉత్సాహాన్ని పెంపొందించాయని టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తిమ్మి సుధాకర్ అన్నారు. జిల్లా మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్ మాట్లాడుతూ.. యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కిషోర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు తలారి అశోక్, బీజేపీ నాయకుడు ఎల్లుపేట రాజు, మాజీ ఉపసర్పంచ్ మంగలి శివయ్య, బోయిని అంబెష్, కొత్త అరవింద్, సల్ల అనిల్, ఎండీ సజ్జాత్, సోహెల్ రోజ్, సయ్యద్ వసీం, రాషద్, హర్షత్ హౌస్ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నగదు రూపంలో అందజేశారు.

## ముత్యంపల్లిలో 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ణ

- హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి
- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు



**వేద న్యూస్, కాసిపేట:**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ -2026లో భాగంగా ముత్యంపల్లి గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట పోలీస్ స్టేషన్ ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో పాటు గ్రామ రోడ్డు భద్రత కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేసి, రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

## క్రీడా ప్రాంగణంలో శ్రమదానం

- పరిశుభ్రతకు నడుం బిగించిన గ్రామస్తులు



**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలం దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని క్రీడా ప్రాంగణంలో సర్పంచ్ సిడం రాందాస్ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆదివాసీ సంఘ సభ్యులు, యువకులు, విద్యార్థులు పాల్గొని ప్రాంగణంలో పేరుకుపోయిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణంలో మద్యం సేవించడం వల్ల క్రీడాకారులకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఇకపై క్రీడా ప్రాంగణం లేదా ప్రకృతి వనాల్లో మద్యం సేవించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువతను ఉద్దేశించి కొమ్ముల బాపు మాట్లాడుతూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆటలు, ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆత్రం సుమలత జంగు, ఎనగందుల సతీష్, ఆత్రం మహేష్‌తో పాటు పలువురు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను మంగళవారం ఆవిష్కరిస్తున్న దేవునూరు గ్రామ కంటెస్టెంట్ సర్పంచ్ కొంగంటి సందీప్, గ్రామ యువకులు

# రామాలయ పూర్తి పత్రాలు ఇవ్వాలి

- తహసీల్దార్‌కు హిందూ కమిటీ వినతిపత్రం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని సులేమాన్ నగర్, రాణంపల్లి శివారులో ఉన్న రామాలయ స్థలానికి సంబంధించిన పూర్తి పత్రాలు అందజేయాలని గ్రామ హిందూ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ తారా బాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాలయానికి సంబంధించిన భూమి సర్వే నంబర్ 217/7, విస్తీర్ణం 1 ఎకరం 15 గుంటలుగా ఉందని తెలిపారు. 1994 నుంచి 2026 వరకు జరిగిన మార్పు చేర్పులకు సంబంధించిన పూర్తి రికార్డులు, పహానీ నకల్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, నాయకులు పార్వతి మురళి, వడ్ల సాయినాథ్, మహేందర్, హిందూ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి మెట్టుగుట్టపై టెండర్లకు వేలం

**వేద న్యూస్, మడికొండ:**



వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ మెట్టుగుట్టలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా దేవస్థాన కార్యాలయంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి సునీత సమక్షంలో, దేవాదాయ శాఖ వరంగల్ విభాగం పరిశీలకుడు అనిల్ పర్యవేక్షణలో లడ్డు, పులిహోర, కొబ్బరికాయలు విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, అభిషేక పంచామృతాల విక్రయం, వాహన పార్కింగ్, చెరుకు బండి నిర్వహణ తదితర హక్కులపై వేలం జరిగింది. ఈ వేలంలో కొబ్బరి చిప్పల సేకరణ హక్కు వరంగల్‌కు చెందిన పాట సిరిపాటి చందు రూ. 33వేలకు దక్కించుకున్నారు. మిగతా అంశాలకు ఆసక్తి గలవారు లేకపోవడంతో సంబంధిత వేలాన్ని ఈ నెల 21వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఆసక్తి గలవారు పాల్గొనవచ్చని కోరారు.

# రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- దామరచర్ల వ్యవసాయ అధికారిణి



**వేద న్యూస్, దామరచర్ల:**

రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని దామరచర్ల మండల వ్యవసాయ అధికారి ఋషేంద్రమణి సూచించారు. మంగళవారం దామరచర్ల రైతు వేదికలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందించే అన్ని పథకాలు ఇకపై ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగానే అమలు చేయబడతాయని తెలిపారు. అందువల్ల రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా లబ్ధి పొందాలంటే వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పార్వతి, ప్రియాంకతో పాటు రైతులు బాబు, లావురి రమేష్, లావురి సైదా, అజ్మీరా బసు, బాలు, సైదా, లింగ తదితరులు పాల్గొన్నారు.

# గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్త

- కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- చైనా మాంజా వాడితే కఠిన చర్యలు
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

**వేద న్యూస్, మెదక్:**



సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రజలు అవసరమైన భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు సూచించారు. ఈ సంద ర్భంగా మెదక్ జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గాలిపటాలు ఎగుర వేసేటప్పుడు కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, భవనాల సమీపంలో అప్రత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పైకప్పులపై గాలిపటాలు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలు తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణలోనే గాలిపటాలు ఎగురవేయాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా ప్రాణాంతకమని, దీని విక్రయం లేదా వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. చెట్లకు లేదా కరెంట్ స్తంభాలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించవద్దని, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు

# పునర్విభజన చిచ్చు!




- గత ప్రభుత్వం హడావుడిగా విభజించిందన్న రేవంత్
- జ్యుడీషియల్ కమిషన్ వేస్తామని ప్రకటన
- జిల్లాల సంఖ్య తగ్గిస్తే అగ్గి రాజేస్తామంటున్న బీఆర్ఎస్
- కేసీఆర్ మార్క్ చెరిపేందుకే అని ఫైర్
- ప్రాంతీయ నేతల బలాన్ని దెబ్బతీసే కుట్ర అని విమర్శలు
- లోకల్ స్టేటస్ మార్పు.. నోటిఫికేషన్లు లేటవుతాయని విద్యార్థుల్లో టెన్షన్
- సీఎం ప్రకటనతో తెలంగాణలో మళ్లీ రాజకీయ అలజడి

## 33 జిల్లాల లెక్క తేల్చేస్తామంటున్న సీఎం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయ భౌగోళిక చిత్రం మరోసారి మారబోతోందా? గత కొన్ని సంవత్సరాలుగా 33 జిల్లాల పరిపాలనకు అలవాటు పడ్డ రాష్ట్రంలో.. ఇప్పుడు వాటి సంఖ్య తగ్గబోతోందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా ప్రకటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతోంది. అసలు జిల్లాల పునర్విభజన అవసరమా? ఎందుకు ఇప్పుడు ఈ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు? అన్న ప్రశ్నలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజన అశాస్త్రీయం అని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా ముక్కలు చేశారని ఇటీవల సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లాల నిర్మాణాన్ని తిరిగి సమీక్షించేందుకు హైకోర్టు లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామని, వారికి ఆరు నెలల గడువు ఇచ్చి నివేదిక తెప్పిస్తామని ప్రకటించారు. అంతేకాదు, ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను అవసరమైతే 17 నుంచి 20 జిల్లాల వరకు తగ్గించే అవకాశం ఉందన్న ప్రచారం కూడా మొదలైంది. ఈ ఒక్క మాటతోనే తెలంగాణ రాజకీయ వాతావరణం వేడెక్కింది.

**- శాస్త్రీయత లోపించిందని..**

గత ప్రభుత్వం రాజకీయ అవసరాలకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేసిందని, అందులో శాస్త్రీయత లోపించిందని చెబుతోంది. కొన్ని జిల్లాలు మరీ చిన్నవిగా మారాయని, మరికొన్ని జిల్లాలు భౌగోళికంగా ప్రజలకు ఇబ్బందిగా ఉన్నాయన్నది ప్రభుత్వ వాదన. కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు దూరంగా ఉండటం, ఒకే అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మండలాలు వేర్వేరు జిల్లాల్లో ఉండటం వల్ల రెవెన్యూ, విద్య, ఆరోగ్య శాఖల్లో సమన్వయం లోపించిందని అధికారులు పేర్కొంటున్నారు. అనేక అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మండలాలు వేర్వేరు జిల్లాల పరిధిలోకి వెళ్లిపోయాయి. దీనివల్ల ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ సమస్యలు రావడమే కాకుండా, అభివృద్ధి పనుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని చిన్న జిల్లాల వల్ల కేవలం ప్రభుత్వ వ్యయం పెరిగిందే తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదని కాంగ్రెస్ ప్రభుత్వం వాదిస్తోంది.

**- తగ్గిస్తే ఊరుకోం.. బీఆర్ఎస్ భగ్గు**

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో మండిపడుతోంది. 33 జిల్లాల ఏర్పాటు వెనుక కేసీఆర్ లక్ష్యం 'పాలన వికేంద్రీకరణ' అని వారు గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ ముద్రను చెరిపేసేందుకే జిల్లాల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని కారు పార్టీ పెద్దలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రాలు దగ్గరవ్వడం వల్ల మారుమూల ప్రాంతాల ప్రజలు సైతం కలెక్టర్‌ను నేరుగా కలిసే అవకాశం కలిగిందని, ఇప్పుడు మళ్లీ జిల్లాలను కలిపేస్తే ప్రజలు ఇబ్బంది పడతారని హెచ్చరిస్తున్నారు. జిల్లాల సంఖ్యను తగ్గిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అగ్గి రాజేస్తున్నారు. కాగా, ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ ఇప్పటివరకు స్పష్టమైన వైఖరి ప్రకటించకుండా వేచి చూద్దాం అన్న ధోరణిని అవలంబిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం పెద్ద రాజకీయ యుద్ధంగా మారితే, ప్రజల్లో అసంతృప్తి పెరిగితే, దానిని రాజకీయంగా మలుచుకోవాలన్న వ్యూహమే బీజేపీదని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

**- కొంతమందిని బలహీన పరిచేందుకేనా?**

ప్రభుత్వ వాదన అలా ఉంటే.. కానీ రాజకీయ వర్గాలు మాత్రం దీనిని కేవలం పరిపాలనా సంస్కరణగా చూడటం లేదు. ప్రతిపక్షాలు ముఖ్యంగా.. ఇది రాజకీయ లెక్కల కోసం తీసుకున్న నిర్ణయం అని ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన జిల్లాలు కొన్ని ప్రాంతీయ నాయకులకు బలంగా మారాయని, ఇప్పుడు వాటిని బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాల కేంద్రాలు మారితే రాజకీయ ప్రాధాన్యతలు కూడా మారతాయి కాబట్టి, ఈ ప్రక్రియ వెనుక వ్యూహం ఉందన్న వాదన వినిపిస్తోంది.

**- విద్యార్థి వర్గాల్లో టెన్షన్!**

రాజకీయ రచ్చ ఒకవైపు ఉంటే, అభ్యర్థులు, విద్యార్థి వర్గాలు మరో ఆందోళనలో ఉన్నాయి. తెలంగాణలో ఉద్యోగ నియామకాలు పూర్తిగా జిల్లా, జోనల్ క్యాడర్ల మీద ఆధారపడి ఉంటాయి. మళ్లీ జిల్లాలు మారితే తమ లోకల్ స్టేటస్ మారుతుందేమోనన్న భయం గ్రూప్స్ అభ్యర్థుల్లో నెలకొంది. కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ మొదలైతే, ఖాళీల వివరాలు మారుతాయని, ఫలితంగా ఇప్పటికే ఆలస్యమైన నోటిఫికేషన్లు మరింత జాప్యం అవుతాయని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండరే విడుదల చేయలేదు.. ఇస్తామన్న నోటిఫికేషన్లు ఇవ్వలే దు.. లక్షలాది మంది విద్యార్థులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు జిల్లాల పునర్విభజన పేరుతో మళ్లీ రెండేళ్లు సాగదీస్తారని, ఇది అన్యాయం అంటూ వాపోతున్నారు.

**- 'కమిషన్లతో పరిష్కారం సాధ్యమేనా?**

ప్రభుత్వం కేవలం రాజకీయ నిర్ణయం తీసుకోకుండా, జ్యుడీషియల్ కమిషన్ వేస్తామనడం వెనుక పారదర్శకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తోంది. ఆరు నెలల సమయం ఇచ్చి, ప్రజాభిప్రా యాన్ని సేకరించడం ద్వారా వివాదాలకు తావు లేకుండా 17 నుంచి 20 వరకు జిల్లాలను కుదించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగా, ప్రతిపక్షాలు, విద్యార్థులు మాత్రం కమిటీ పేరుతో కాలయాపన చేయడానికే ప్లాన్ చేశారని మండి పడుతున్నారు. ఆరు నెలల సమయం అంటే అంతవరకూ రాజకీయ వేడి తగ్గుతుందని, ఈ లోపే తాము అనుకున్న విధంగా పునర్విభజన చేస్తారని ఆరోపిస్తు?న్నారు. ఇక విద్యార్థులు మాత్రం.. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు.. ఇస్తామన్న నోటిఫికేషన్లు ఇవ్వలేదు.. ఇప్పుడు జిల్లాల పునర్విభజన పేరుతో మళ్లీ రెండేళ్లు సాగదీస్తారని, ఇది అన్యాయం అంటూ వాపోతున్నారు.

# మహాజాతరకు రికార్డు స్థాయి ఏర్పాట్లు

మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ జాతరకు మొత్తం రూ.251కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఏర్పాట్లకు రూ.150 కోట్లు, గద్దెల పునరుద్ధరణకు రూ.101 కోట్లు కేటాయించారు. ఇది మేడారం జాతర చరిత్రలోనే అతిపెద్ద నిధుల కేటాయింపుగా పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ.. జాతర ఏర్పాట్లను ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, భద్రత, ప్రజా సమాచార వ్యవస్థలను బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ములుగు జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర మాట్లాడుతూ, రోజుకు గరిష్టంగా 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మేడారం మహాజాతర అధికారిక లోగో, ప్రత్యేక యాప్, ప్రచార వీడియోలను విడుదల చేశారు. తెలంగాణ సంస్కృతి, ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతరను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

# కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మిక అంతర్జాతీయ ఆహ్వానం

- న్యూయార్క్‌లోని కొలంబియా బిజినెస్ స్కూల్ వేదికగా ప్రసంగం
- 21వ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు విశిష్ట వక్తగా ఎంపిక
- తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై అంతర్జాతీయ స్థాయిలో చర్చ

**వేద న్యూస్ హైదరాబాద్ :**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు మరో ప్రతిష్టాత్మిక అంతర్జాతీయ ఆహ్వానం లభించిం ది. న్యూయార్క్ నగరంలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత కొలంబియా బిజినెస్ స్కూల్ నిర్వహించనున్న 21వ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ లో ప్రసంగించాల్సిందిగా నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, ఆవిష్కరణల పరంగా ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలిపిన తీరును గుర్తిస్తూ, అంతర్జాతీయ వేదికపై తన ఆలోచనలు, అనుభవాలను పంచుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ ప్రతిష్టాత్మిక కార్యక్రమం ఏప్రిల్ 4, 2026న న్యూయార్క్‌లో జరగనుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారత ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్ సంస్కృతి, ప్రాంతీయ అభివృద్ధి మోడళ్లపై చర్చించే ఈ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్‌ను విశిష్ట వక్తగా ఆహ్వానించడం గర్వకారణమని కొలంబియా బిజినెస్ స్కూల్ నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణలో ఐటీ, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ఆకర్షణలో కేటీఆర్ పోషించిన పాత్ర ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని వారు ప్రశంసించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ అభివృద్ధి ప్రయాణాన్ని వివరించిన కేటీఆర్‌కు ఇది మరో కీలక అవకాశం గా రాజకీయ, పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తృత చర్చ జరగనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు!



**వేద న్యూస్, హైదరాబాద్:**

పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ డ్రామాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. విచారణల పేరుతో కమిషన్లు, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లు ఏర్పాటు చేయడం తప్ప, నిజమైన అవినీతి కేసులపై చర్యలు లేవని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక మంత్రి పీఏ, ముఖ్యమంత్రి సన్నిహితులతో కలిసి పారిశ్రామికవేత్తను బెదిరించి రూ.300 కోట్ల డిమాండ్ చేసిన ఘటనపై సిట్ ఎందుకు లేదని ప్రశ్నించారు. ములుగు జిల్లాలో ఇసుక దందా, రెవెన్యూ మంత్రి కుటుంబానికి సంబంధించిన భూ కబ్జాలు, కాంగ్రెస్ నేతల బెదిరింపుల కేసులపై కూడా ఎలాంటి చర్యలు లేవని అన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలల బంకర్ బెడ్స్ కొనుగోళ్లలో రూ.100 కోట్ల కుంభకోణం జరిగినా బాధ్యులపై చర్యలు లేవని విమర్శించారు. లిక్కర్ హెలోగ్రాం టెండర్, చీప్ లిక్కర్ కంపెనీలకు అక్రమ అనుమతులు, యూనివర్సిటీ భూముల విక్రయం వంటి భారీ స్కాంలపై సిట్ ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. అయితే అధికార పార్టీకి దగ్గరగా ఉన్న ఒక టీవీ ఛానెల్ వార్తను ఉటంకించిందన్న కారణంతో మీడియాపై సిట్ ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆరో పించారు. మీడియాను వేధించడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచలేరని, ప్రశ్నించే గొంతు కలను అణిచే ప్రయత్నం కొనసాగితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కేటీఆర్ హెచ్చరిం చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసా గిస్తుందని స్పష్టం చేశారు.

# కవిత కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారంలో వాస్తవం లేదు

- ఆమె వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదు
- బీఆర్ఎస్ అవినీతిపై కవిత ఆరోపణలే నిదర్శనం
- సిట్ ఏర్పాటు సరైన నిర్ణయం
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరతారన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కవిత చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని, బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీ, అవినీతిపై కవిత చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రశ్నిస్తే రాజకీయ ఆరోపణలంటారని, అదే విషయాన్ని కవిత చెబితే మౌనం ఎందుకని ప్రశ్నించారు. గతంలో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని, కుటుంబ ప్రయోజనాల కోసమే కేసీఆర్ ఆ నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. బీజేపీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. దేవుడి పేరు లేకుండా బీజేపీ రాజకీయాలు చేయదని, అన్ని మతాలను గౌరవించే సంప్రదాయం కాంగ్రెస్‌దేనని అన్నారు. బీఆర్ఎస్‌కు చరిత్ర మాత్రమే మిగులుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని, మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని చెప్పారు. మేడారంలో మంత్రివర్గ సమావేశం మంచి నిర్ణయమని, సినిమాల టికెట్ ధరల విషయంలో పరిశ్రమను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. పార్టీలో ఒకరికి రెండు నామినేటెడ్ పదవులు ఇవ్వకూడదని నిర్ణయించినట్లు వెల్లడించారు. మీడియాలో ఐఏఎస్ అధికారులపై వచ్చిన ఆరోపణలు సరికాదని, అసత్య కథనాలపై సిట్ ఏర్పాటు చేయడం సముచిత నిర్ణయమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయడం తగదని స్పష్టం చేశారు.

# 'బూత్ నిర్మాణ్ అభియాన్ కార్యశాల' సమావేశం



**వేద న్యూస్, బోయినిపల్లి :**

బూత్ నిర్మాణ్ అభియాన్ మండల కార్యశాల సమావేశం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ జిల్లా బూత్ నిర్మాణ్ అభియాన్ కన్వీనర్ సాయిని మల్లేశం మాట్లాడుతూ.. బూత్ స్థాయే బీజేపీకి బలమైన పునాదని అన్నారు. ప్రతి నాయకుడు తన బూత్‌ను పటిష్టం చేయడంతో పాటు, పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. బలమైన బూత్‌లు ఉంటేనే బలమైన పార్టీ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. సమగ్ర ఓటరు డేటా, నిరంతర ప్రచారం, పోలింగ్ రోజు పూర్తి స్థాయి సంసిద్ధత అవసరమని పేర్కొన్నారు. అలాగే శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు చురుకైన పర్యవేక్షణతో బూత్‌లను బలోపేతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, బూత్ నిర్మాణ్ మండల కన్వీనర్ పసికంటి వెంకటేశ్, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్ ప్రచురించిన నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ను అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ వరంగల్ తూర్పు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా జిల్లా మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావుకు ఎల్లవేళలా భద్రకాళి మాత ఆశీర్వాదం ఉండి ఇంకా పెద్ద పదవులు రావాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు పగడాల సతీశ్, బత్తుల నవీన్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీకి బల్బుల వితరణ



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ దయాల లక్ష్మణ్ తన సొంత ఖర్చులతో గ్రామానికి అవసరమైన విద్యుత్ బల్బులను కొనుగోలు చేసి గ్రామపంచాయతీకి బహూకరించారు. మంగళవారం గ్రామ సర్పంచ్ కొండల్వాడి శంకర్, గ్రామ పెద్దల సమక్షంలో ఈ బల్బులను అందజేశారు. ఈ సందర్భంగా దయాల లక్ష్మణ్ మాట్లాడుతూ, పుట్టిన ఊరికి ఏదో ఒక రూపంలో సేవ చేయాలనే సంకల్పంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు కలిసి వీధివీధిగా తిరుగుతూ కరెంట్ స్తంభాలకు బల్బులను అమర్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తోట అనిత భాస్కర్, తోట నర్సింలు, గాండ్ల ప్రవీణ్, గ్రామ పెద్దలు తోట సంగయ్య, నేరుగంటి బాలరాజు, తోట ప్రభాకర్, నడిపి సాయిలు, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగ్గుల పోటీలు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్, పంచాయతీ పాలక వర్గం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో స్నేహభావం పెంపొందించడంతో పాటు మహిళలకు ప్రోత్సాహం ఇచ్చేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అతికం రాజశేఖర్ గౌడ్, మ్యాన వర్షిత వెంకటేష్, పేరుక గౌతమి మహేష్, కల్లేపల్లి మమత, కొలుపుల మల్లేశం, అక్క రాజు తిరుపతి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# సంబంధంలేని ఓట్ల తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**వేద న్యూస్, చొప్పదండి, కరీంనగర్:**

రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చొప్పదండిలో నూతనంగా 66 డివిజన్లను ఏర్పాటు చేసి, ప్రతి డివిజన్‌కు హౌస్ నంబర్లతో సరిహద్దులు ఖరారు చేసినట్లు కంసాల శ్రీనివాస్ తెలిపారు. అయితే ఈ ప్రక్రియలో ఇతర డివిజన్లకు చెందిన ఓట్లు తమ డివిజన్‌లో చేర్చినట్లు గుర్తించి ముందుగానే అభ్యంతరాలు వ్యక్తం చేశామని తెలిపారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం అధికారులు తుది ఓటర్ జాబితాను విడుదల చేసినప్పటికీ, వాటిని పరిశీలించగా 10-5, 10-6 సిరీస్‌లకు సంబంధం లేకుండా అశోక్ నగర్‌కు చెందిన ఓట్లను పెద్ద సంఖ్యలో 29వ డివిజన్‌లో చేర్చినట్లు వెల్లడించారు. అశోక్ నగర్‌కు కిసాన్ నగర్‌కు మధ్య ఎలాంటి సరిహద్దు లేకపోయినా ఇలా సంబంధంలేని ఓట్లను కలపడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఇతర డివిజన్లకు చెందిన ఓట్లను కూడా మధ్య మధ్యలో కలిపినట్లు కనిపిస్తోందని, ఇది కావాలనే కుట్రపూరితంగా జరిగిన చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ఈ అంశంపై తక్షణమే సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తప్పులు లేని ఓటర్ జాబితాను రూపొందించి, నిస్పాక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కంసాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# వీఆర్‌ఏల పదోన్నతుల ప్రొహిబిషన్ సమస్య పరిష్కారం

**- ధన్యవాదాలు తెలిపిన టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమాండ్ల రాజు**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వీఆర్‌ఏ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఉద్యోగులకు సంబంధించిన వన్ ఇయర్ ప్రొహిబిషన్ డిక్లరేషన్ సమస్యకు పరిష్కారం లభించినందుకు టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమాండ్ల రాజు టీజేటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఇక్బాల్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయమై టీజేటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఇక్బాల్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే స్పందించి తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ గౌరవ లచ్చిరెడ్డి తో చర్చించారని, లచ్చిరెడ్డి చొరవతో వరంగల్ కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించడంతో, రెండు మూడు రోజుల వ్యవధిలోనే సంబంధిత ఉద్యోగుల ప్రొహిబిషన్ డిక్లేర్ చేయడం జరిగిందని కొమాండ్ల రాజు తెలిపారు. ఈ పరిణామంతో ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించినందుకు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఇక్బాల్, అలాగే వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఏవో విశ్వప్రసాద్‌కు కొమాండ్ల రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలపై సంఘ నాయకుల చూపిన కృషి అభినందనీయమన్నారు.

# 1104 డైరీ ఆవిష్కరణ



**వేద న్యూస్, జమ్మికుంట:**

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్-2026 డైరీ, క్యాలెండర్‌ను విద్యుత్ డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయంలో హుజురాబాద్ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్ర మంలో రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ తలగంప రాములు, డివిజనల్ ప్రెసిడెంట్ మోతే శ్రీనివాస్, సెక్రటరీ గంగిశెట్టి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ రవి, ట్రెజరర్ నలబాల రవి, అసిస్టెంట్ సెక్రటరీ అశ్వత్ కృష్ణ, కంపెనీ నాయకులు, యాకుబ్ అలీ, రమణారెడ్డి, సాగర్, సర్కిల్ నాయకులు, సిహెచ్ కుమారస్వామి, సదయ్య, యాదగిరి, వేణుగోపాల్ ,తిరుపతి, ఆదిబాబు,దీషి అసోసియేషన్ ప్రెసిడెంట్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు కొత్త అందాలు



**వేద న్యూస్ హైదరాబాద్ :**

పాతబస్తీలోని బమ్ - రుక్న్ - ఉద్ - దౌలా చెరువు సర్వాంగ సుందరంగా మారి నగర వాసులను ఆకట్టుకుంటోంది. తుది దశకు చేరుకున్న అభివృద్ధి పనులను హైడ్రా కమిష నర్ ఏవీ రంగనాథ్ మంగళవారం రాత్రి పరిశీలించారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఉన్న చెరువు గట్టుపై నడుచుకుంటూ వెళ్తూ పలు సూచనలు చేశారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన లైటింగ్‌ను పరిశీలించిన కమిషనర్, సీసీటీవీ కెమెరాలు మరింత స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్థానికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్న ఆయన, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆదేశించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వస్తున్నందున వారికి అనువైన వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చెరువు చరిత్రను వివరించేలా ప్రవేశ మార్గం వద్ద శిలాఫలకాన్ని అభివృద్ధి చేయాలని, ఔషధ గుణాలున్న నీటితో నిజాముల కాలంలో అలరారిన ఈ చెరువు చుట్టూ మెడిసినల్ ప్లాంట్స్ నాటాలని సూచించారు. పిల్లలు, పెద్దలు భద్రంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో విహరించేలా పరిసరాలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి పండగ తర్వాత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు.

# 'ప్రసంగి' విద్యార్థుల ప్రభంజనం

**- రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో..**

**వేద న్యూస్, జమ్మికుంట:**

శ్రీ సాయి నాట్య కళా నిలయం ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోవైశ్యా భవన్ వేదికగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు - 2026 రాష్ట్రస్థాయి నృత్య పోటీలు కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయం, ఆధునిక నృత్య శైలులకు సమన్వయంగా ఈ పోటీలను క్రమశిక్షణతో నిర్వహించిన శ్రీ సాయి నాట్య కళా నిలయం నిర్వాహకుల కృషి అభినందనీయం అని అతిథులు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ ముకేష్ గౌడ్ , మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాకం సంతోష్ హాజరై, పోటీలను ప్రారంభించి విజేతలకు అభినందనలు తెలిపారు. నృత్య రంగ ప్రముఖులైన టాలెంట్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ రమణ ,డాన్స్ మాస్టర్ రాంబాబు , గ్రాండ్ మాస్టర్ జె. గోపీ , టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమండ్ల మధు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యూట్యూబ్ స్టార్స్ వర్షిని, నీతూ క్వీన్ పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు.

**మెరిసిన 'ప్రసంగి' స్టూడెంట్స్**

ఈ పోటీల్లో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు తమ అద్భుత నృత్య ప్రతిభతో వేదికపై మెరుపులు మెరిపించారు. లయపాటవం, భావవ్యక్తీకరణ, శక్తిమంతమైన స్టెప్పులు, వేదికపై ఆత్మవిశ్వాసం నిండిన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చిన్న వయసులోనే ఇంతటి నైపుణ్యం సాధించడం ప్రశంసనీయమని న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు. ఫోక్ జూనియర్ గ్రూప్ డాన్స్ విభాగంలో కొల్లూరి రసగ్నా టీమ్ ప్రథమ బహుమతి సాధించగా, వెస్టన్ జూనియర్ సోలో విభాగం..లో పోట్లశ్రీ ప్రకృతి ద్వితీయ బహుమతి, వెస్టన్



జూనియర్ గ్రూప్ డాన్స్ విభాగంలో లియాప్రసంగి టీమ్ ద్వితీయ బహుమతి గెలుచుకుంది. వెస్టన్ జూనియర్ డ్యూయెట్ డాన్స్ విభాగంలో పోట్లశ్రీ ప్రకృతి, కొల్లూరి రసగ్నా ..ద్వితీయ బహుమతి సాధించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన టెకో శ్రీధర్, ఆటా5 ఫేమ్ డాన్స్ మాస్టర్ ఆనంద్.. ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ప్రత్యేకంగా ప్రశంసించారు. వారి ప్రదర్శనల్లో లయబద్ధత, భావవ్యక్తీకరణ, స్టేజ్ ప్రెజెన్స్ అత్యుత్తమంగా ఉన్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన డాన్స్ మాస్టర్లు ప్రసంగి, కే.రాజు (కే. రాజేష్) సేవలను గుర్తించి, కార్యక్రమానికి హాజరైన అతిథుల చేత ఘనంగా సన్మానం చేశారు. ఈ విజయాలు ప్రసంగి డాన్స్ స్టూడియోకే కాకుండా జమ్మికుంట ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాయి. ఈ సందర్భంగా స్టూడియో ప్రొప్రైటర్ ఎన్. శ్రీలత విద్యార్థులు, మాస్టర్లను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చైనా మాంజా కోసుకుపోయి వృద్ధురాలికి తీవ్ర గాయాలు



**వేద న్యూస్ రంగారెడ్డి :**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాదమ్మ (70) అనే వృద్ధురాలి కాలికి చైనా మాంజా కాలికి చుట్టుకుంది. ఈ ఘటనలో ఆమె కాలు తీవ్రంగా కోసుకుపోయి భారీగా రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వృద్ధురాలిని సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నట్లు సమాచారం. నిషేధిత చైనా మాంజా వినియోగం వల్ల ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతున్నప్పటికీ, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వేద న్యూస్

బుధవారం జనవరి 14, 2026

# నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు




**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండిలో నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కల్లెం మనీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంగు సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మనీష్ రెడ్డి మాట్లాడుతూ.. యువతను సంఘటితం చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని, గ్రామాభివృద్ధి, యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నూతన కమిటీ ఏర్పాటుపై సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం




**వేద న్యూస్, కాసిపేట :**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా 'అరైవ్ అలైవ్ణ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం కాసిపేట మండల పరిధిలోని దేవాపూర్, గాట్రవుపల్లి, యాప, కొనూర్ గ్రామాల్లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాపూర్ ఎస్ఐ గంగారం పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని ఎస్ఐ గంగారం కోరారు.

# వీధులు, రోడ్లు శుభ్రంగా ఉంచాలి



- చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలి
- ఇంటి పన్నులు 100శాతం వసూలు చేయాలి
- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

**వేద న్యూస్, కాసిపేట :**

గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వీధులు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కాసిపేట మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కొండాపూర్, కోనూరు, తాటిగూడ, దేవాపూర్, మద్దిమడ గ్రామపంచాయతీలను సందర్శించి గ్రామస్థాయి పనులను పరిశీలించారు. పారిశుధ్య పనులు, మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణ, సిగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి సిగ్రిగేషన్ షెడ్లకు తరలించి, వర్మీ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించాలని సూచించారు. ఈ నెల 15లోపు ప్రతి గ్రామపంచాయతీ 100 శాతం ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే వాటర్ సప్లై, స్టాట్యూటరీ రిజిస్టర్లు నవీకరణ, పంచాయతీ ఖాతాల సంతకాల అప్డేట్, మల్టీపర్పస్ వర్కర్ల జీతాల చెల్లింపులపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ పర్యటనలో డివిజనల్ పంచాయతీ అధికారి కె. సతీష్ కుమార్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ పాల్గొన్నారు. అనంతరం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



- రుద్రూర్ సీఐ కృష్ణ

**వేద న్యూస్, రుద్రూర్ :**

వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని రుద్రూర్ సీఐ కృష్ణ సూచించారు. మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్సై సాయన్నతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం మానుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు సభ్యులు అమంద్ వెంకటేశ్వర్, వడ్ల నరేష్, గౌడ సంఘం అధ్యక్షులు విఠల్ గౌడ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి మేడిపల్లి భరోసా

- రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ కార్యకర్త మృతి
- కుటుంబానికి ఆర్థిక సహాయం.. అండగా ఉంటానని హామీ



**వేద న్యూస్, చొప్పదండి/గంగాధర :**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన మానవత్వాన్ని చాటుకున్నారు. గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గరిగంటి కరుణాకర్ నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనపై ఇప్పటికే కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే, ఇచ్చిన హామీ మేరకు మంగళవారం కరుణాకర్ నివాసానికి వెళ్లి సొంతంగా రూ.3 లక్షలు, ప్రభుత్వం తరఫున రూ.1 లక్ష మొత్తం రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుల్లా కాపాడుకుంటామని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పెద్దన్నలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. కరుణాకర్ కుటుంబానికి సహాయం చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యాన్ని చొప్పదండి నియోజకవర్గ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అంబటి రజిత, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతుల ప్రదానం



**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ నగరంలోని రంగశాయిపేట క్రీడా మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన జట్లకు స్థానిక కార్పొరేటర్ పోషాల పద్మ బహుమతులు అందజేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ వాలీబాల్ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పోటీల్లో మేడారం జట్టు ప్రథమ బహుమతిని, వరంగల్ జట్టు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఏనుగుల రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు తరుణ్, సందీప్, డి. కిషోర్, ఆర్.కె. చిన్న, పవన్, రాజు, నయీం, మహేందర్, శ్రావణ్, భాస్కర్, రాహుల్, వాకర్ గ్రూప్ సభ్యులు, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వరంగల్ అభివృద్ధే మా లక్ష్యం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దడమే కొండా దంపతుల లక్ష్యం అని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుతో కలిసి ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా కొండా రాష్ట్ర మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాయకత్వంలో మరింత అభివృద్ధి పథంలో నడిచే విధంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ జెండాను మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నటువంటి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఎవరు కూడా ధైర్యపడవలసిన అవసరం లేదని అన్నారు. కొండా దంపతులు ఎల్లవేళలా వరంగల్ తూర్పు ప్రజల అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తారని ఈ సందర్భంగా మంత్రి సురేఖ తెలిపారు. కార్యకర్తలను, నాయకులను కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు.

# వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- రోడ్డు భద్రతపై అవగాహన కల్గి ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం అరైవ్ అలైవ్ ను పోలీసులు ఘనంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై అనిల్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ఉపయోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణనష్టం జరగడానికి హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణమని తెలిపారు. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లు ప్రజల రక్షణ కోసమేనని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్లు బాగు చేయాలని వినతి



**వేద న్యూస్, కరీమాబాద్ :**

గ్రేటర్ వరంగల్ 39వ డివిజన్లో మిషన్ భగీరథ కోసం రోడ్లను తవ్వడం ద్వారా ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని 39వ డివిజన్ నాయకుడు నాగపురి నాగరాజు మంగళవారం రాష్ట్ర మంత్రి కొండ సురేఖకు వినతి పత్రం అందించారు. తమ డివిజన్లో సిసి రోడ్డు తవ్వకాలు జరగడం వల్ల వాహనదారులకు చాలా ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని వినపించారు. వీలైనంత త్వరగా తమ డివిజన్లోని సిసి రోడ్ వేయాలని మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రోడ్డు వేపిస్తానని మాట ఇచ్చినట్లు నాగపురి నాగరాజు తెలిపారు.

# టీఆర్ఆర్ఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ




**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

తెలంగాణ రైతు రక్షణ సమితి (టీఆర్ఆర్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా 2026 - క్యాలెండర్‌ను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు రామారావు, రవీందర్‌తో పాటు జిల్లా నాయకులు సురావు బాబురావు, లోనే సతీష్, వంకే రాజు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు రక్షణ సమితి నిరంతరం కృషి చేస్తున్నదని, రైతుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేపడుతూ, ప్రభుత్వానికి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

వేద న్యూస్

బుధవారం జనవరి 14, 2026

# సీసీఎస్ కేసుల దర్యాప్తుకు సిట్ ఏర్పాటు

**వేద న్యూస్ హైదరాబాద్ :**



నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్, హైదరాబాద్‌లోని సీసీఎస్‌లో నమోదైన పలు సున్నితమైన కేసుల దర్యాప్తు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. మహిళా ఐఏఎస్ అధికారిణిని కించపరిచిన ఘటనతో పాటు, నారాయణపేట మద్దూర్‌లో నమోదైన కేసులను ఈ సిట్ విచారించనుంది. ఈ మేరకు డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సిట్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పర్యవేక్షించనున్నారు.

**– సీఎం ఫోటోలను మార్ఫింగ్ చేసిన కేసు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసిన ఘటనలో నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూప్‌లో కావలి వెంకటేష్ అనే వ్యక్తిపై కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఫిర్యాదు మేరకు ఈ నెల 11న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని కూడా సిట్ దర్యాప్తు చేయనుంది.

**– మహిళా ఐఏఎస్ అధికారిణి అవమానంపై సీసీఎస్ కేసు**

ఇటీవల మహిళా ఐఏఎస్ అధికారిణిని కించపరిచే విధంగా వార్తలు ప్రసారం చేసిన వ్యవహారంలో ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేష్ రంజన్ ఫిర్యాదు మేరకు సీసీఎస్‌లో కేసు నమోదైంది. రెండు తెలుగు న్యూస్ ఛానెల్స్‌తో పాటు ఏడు యూట్యూబ్ ఛానెళ్లపై బీఎన్ఎస్ 75, 78, 79, 351(1), 352(2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ రెండు కేసులనూ సిట్ విచారించనుంది.

**– సిట్ సభ్యులు**

ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్ సెల్ ఎస్సై హరీశ్ సభ్యులుగా ఉన్నారు.

**– భావప్రకటన స్వేచ్ఛపై హెచ్చరిక**

వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే వార్తల ప్రసారాన్ని న్యాయవేత్త జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఐఏఎస్ అధికారిణుల పట్ల అసభ్యంగా రాయడం గర్హనీయమని ఆయన వ్యాఖ్యానించారు. భావప్రకటన స్వేచ్ఛ సమాజానికి ప్రాణవాయువులాంటిదైనా, రాజ్యాంగం పరిమితిలేని స్వేచ్ఛను హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. దుర్వినియోగం జరిగితే నియంత్రణ తప్పదని హెచ్చరిస్తూ, స్వీయ నియంత్రణ అత్యవసరమని సూచించారు.

**– ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ సిట్**

ఇదిలా ఉండగా, తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులోనూ ఇప్పటికే సిట్ ఏర్పాటైంది. ఈ సిట్‌ను కూడా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేశారు. ఈ బృందంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ నారాయణ్ రెడ్డి, డీసీపీ రితురాజ్, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్ రెడ్డి తదితరులు సభ్యులుగా ఉన్నారు. అదే విధంగా బెట్టింగ్ యాప్‌ల కేసు విచారణ కోసం గతంలో ఏర్పాటు చేసిన సిట్ పలువురు ప్రముఖులను విచారించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సినీ నటులు ప్రకాశ్ రాజ్, దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీతో పాటు మొత్తం 29 మంది నిందితులుగా ఉన్నారు. ఈ పరిణామాలతో తెలంగాణలో సిట్ దర్యాప్తులు మరోసారి రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలోనే ప్రజా ప్రభుత్వం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- అశ్వరావుపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- దమ్మపేటలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ప్రారంభం

**వేద న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం :**

అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అమలు చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ, ఐఅండ్‌పీఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పర్యటన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అశ్వరావుపేటలో రూ.1.5 కోట్ల వ్యయంతో మున్సిపల్ మార్కెట్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణ పనులకు, అలాగే రూ.7 కోట్ల అంచనా వ్యయంతో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయ్యాక పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. అలాగే దమ్మపేటలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించి, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క--సారలమ్మ మేడారం మహాజాతరను శాశ్వత అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని తెలిపారు. జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న మహాజాతర కోసం కాకతీయ శైలిలో శాశ్వత రాతి నిర్మాణాలు చేపడుతున్నామని, ఇవి రాబోయే 200 సంవత్సరాల పాటు నిలిచేలా రూపొందిస్తున్నామని వెల్లడించారు. మేడారం జాతర అభివృద్ధి పనుల పరిశీలనకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 18న మేడారాన్ని సందర్శించనున్నారని, జనవరి 19న పునరుద్ధరణ, అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించనున్నారని మంత్రి ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం జాతరను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# సీఎం కప్--2026 క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభం

**వేద న్యూస్ సూర్యాపేట:**



సూర్యాపేట జిల్లాలో క్రీడా ఉత్సాహం నూతన ఊపందుకుంది. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సీఎం కప్--2026' క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటూ క్రీడా వాతావరణాన్ని సృష్టించారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మరియు జిల్లా ఎస్పీ కే. నరసింహ కలిసి క్రీడా టార్చ్‌ను వెలిగించి, జెండా ఊపి భారీ ర్యాలీని ప్రారంభించారు. పట్టణ వీధుల్లో సాగిన ఈ ర్యాలీ క్రీడా పోటీలపై అవగాహన పెంచడంతో పాటు యువతలో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ యువత క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదలతో రాణించాలని ఆకాంక్షించారు. సీఎం కప్ పోటీలు భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకునేందుకు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడల్లో మెరుగైన ప్రదర్శనతో సూర్యాపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు.

# జీహెచ్‌ఎంసీ పరిధిలో మెగా ఈ - వ్యర్థాల శుభ్రతా డ్రైవ్

**వేద న్యూస్ హైదరాబాద్ :**



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన మెగా ఈ-వ్యర్థాల శుభ్రతా డ్రైవ్ రెండో రోజుకూడా విజయవంతంగా కొనసాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాలు, ఈ-వ్యర్థాల సేకరణ కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, వినియోగానికి పనికిరాని పరికరాలను సేకరిస్తున్నారు. డ్రైవ్ తొలి రోజే ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని అధికారులు తెలిపారు. ఒక్క రోజులోనే 47 మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలను సేకరించడం ఈ కార్యక్రమానికి ప్రజల మద్దతు ఎంత బలంగా ఉందో సూచిస్తోందన్నారు. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టీవీలు, బ్యాటరీలు వంటి ఈ-వ్యర్థాలను సురక్షితంగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ-వ్యర్థాలను ఇళ్లలో, వీధుల్లో పడేయకుండా అధికారికంగా సేకరణకు అందించాలని జీహెచ్‌ఎంసీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. శుభ్రమైన, పచ్చని హైదరాబాద్ లక్ష్యంగా ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని, ఈ డ్రైవ్‌కు సహకరించాలని అధికారులు కోరారు.

# గాలిపటాల ఆటలో దాగి ఉన్న మానవ సంబంధాలు

- పండుగలతో ముడిపడిన సాంస్కృతిక వారసత్వం
- ప్రపంచాన్ని కలిపే భారతీయ ఆకాశోత్సవం

**వేద న్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ గాలిపటాల దినోత్సవం అనేది కేవలం ఒక వినోద దినం మాత్రమే కాదు; ఇది మానవ సంబంధాలను మరింత బలపరిచే సామాజిక వేడుక. గాలిపటం చేతిలో పట్టుకున్న క్షణంలో వయస్సు తేడా మరిచిపోతుంది, హోదాలు కరిగిపోతాయి, అందరూ ఒకే ఆనందంలో లీనమవుతారు. పిల్లల ఉత్సాహం, యువత పోటీ తపన, పెద్దల అనుభవం– ఇవన్నీ కలిసి ఈ దినాన్ని ఒక సమూహ అనుభూతిగా మారుస్తాయి. ఆకాశంలో ఎగిరే ప్రతి గాలిపటం మనసులోని ఒత్తిడిని తేలికపరుస్తూ, స్వేచ్ఛ భావనను గుర్తుచేస్తుంది.

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగతో గాలిపటాల ఆటకు విడదీయలేని సంబంధం ఉంది. పంటల కోత పూర్తై, రైతు ఇంటికి ధాన్యం చేరిన ఆనందం ఈ ఆటలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో మైదానాలు, నగరాల్లో ఇళ్ల పైకప్పులు– అన్నీ గాలిపటాల పండుగకు వేదికలుగా మారతాయి. కుటుంబ సభ్యులు ఒకే చోట చేరి, పనుల ఒత్తిడి మరిచి, కలిసి గాలిపటాలు ఎగరేయడం ద్వారా బంధాలు మరింత బలపడతాయి. ఈ ఆట ద్వారా తరం నుంచి తరానికి సంప్రదాయం మౌనంగా బదిలీ అవుతుంది.

గాలిపటాల దినోత్సవం పోటీ ఉత్సాహానికీ ప్రతీక. దారాలు కత్తిరించేందుకు వ్యూహాలు, గాలిని అంచనా వేసే నైపుణ్యం, ఓటమిని స్వీకరించే మనస్తత్వం – ఇవన్నీ జీవితానికి అవసరమైన పాఠాలే. గెలుపు క్షణంలో వచ్చే ఆనందం కంటే, ఓడిన తర్వాత కూడా చిరునవ్వుతో మళ్లీ ప్రయత్నించడమే ఈ ఆట నేర్పే అసలైన సందేశం. అందుకే గాలిపటాల ఆటను చిన్నపాటి జీవన పాఠశాలగా కూడా చెప్పవచ్చు.

భారత్‌లో గాలిపటాల వేడుకలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ప్రాంతాల్లో గుజరాత్ ప్రముఖంగా నిలుస్తుంది. అక్కడ జరిగే అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవాలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. వివిధ దేశాల నుంచి కళాకారులు, నిపుణులు పాల్గొని తమ తమ దేశాల ప్రత్యేక గాలిపటాలను ప్రదర్శిస్తారు. ఈ వేడుకలు భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా, దేశాల మధ్య స్నేహబంధాన్ని బలపరిచే వేదికగా మారుతున్నాయి.

ఆధునిక కాలంలో డిజిటల్ జీవనశైలి పెరిగిన నేపథ్యంలో, గాలిపటాల దినోత్సవం ఒక అవసరమైన విరామంలా మారింది. మొబైల్, స్క్రీన్‌లకు పరిమితమైన జీవితాల నుంచి బయటకు వచ్చి, ఆకాశాన్ని చూస్తూ, గాలిని అనుభవిస్తూ, ప్రకృతితో అనుసంధానం పెంచుకునే అవకాశం ఈ దినం ఇస్తుంది. పిల్లల్లో శారీరక చురుకుదనం, పెద్దల్లో మానసిక ఉల్లాసం పెరగడంలో గాలిపటాల ఆట కీలక పాత్ర పోషిస్తుంది.

మొత్తానికి, అంతర్జాతీయ గాలిపటాల దినోత్సవం అనేది ఒక ఆటకే పరిమితం కాని గొప్ప సాంస్కృతిక సంఘటన. ఇది ఆనందాన్ని పంచుతుంది, స్నేహాన్ని పెంచుతుంది, ప్రపంచాన్ని ఒకే ఆకాశం కిందకు తీసుకువస్తుంది. ఆకాశంలో ఎగిరే గాలిపటాలు మన ఆశలు, కలలు, స్వేచ్ఛ కోరికలకు ప్రతీకలుగా నిలుస్తూ – మనుషుల మధ్య దూరాలను తగ్గించే నిశ్శబ్ద దూతలుగా మారుతాయి.

ప్రత్యేకంగా సంక్రాంతి పండుగ కాలంలో ఈ దినానికి మరింత ప్రాధాన్యత ఏర్పడుతుంది. పంటల కోత అనంతరం రైతు కుటుంబాల్లో కనిపించే ఆనందం, సెలవుల వాతావరణం, గ్రామీణ--నగర జీవనాల్లో ఒకేలా కనిపించే ఉత్సవ ఉత్సాహం గాలిపటాల ఆటతో మరింత విస్తరిస్తుంది. ప్రతి ఇంటి పైకప్పు, ప్రతి మైదానం ఒక చిన్న పండుగ వేదికగా మారుతుంది. సంప్రదాయ విలువలతో పాటు ఆధునిక ఆలోచనలను కలిపే శక్తి ఈ వేడుకలో స్పష్టంగా కనిపిస్తుంది.

## డా. మర్రి చెన్నారెడ్డి 107వ జయంతి

# సందర్భంగా ఘన నివాళులు

**వేద న్యూస్ హైదరాబాద్ :**



మాజీ ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి 107వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఉన్న వారి సమాధికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డా. మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా వివిధ బాధ్యతలు నిర్వహించిన డా. మర్రి చెన్నారెడ్డి ప్రతి పదవిలోనూ రాజనీతిజ్ఞత, పరిపాలనా దక్షతను చాటుకున్న దార్శనికుడని ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన చూపిన దూరదృష్టి రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని అన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం పనిచేసిన నాయకుడిగా ఆయన తరతరాలకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మర్రి శశిధర్ రెడ్డి, వి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. డా. మర్రి చెన్నారెడ్డి ఆశయాలు, విలువలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని నేతలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

**వేద న్యూస్ భీమదేవరపల్లి :**



కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంగళవారం వీరభద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కోరిన కోరికలు తీర్చాలని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతితో ముడిపడి ఉన్న సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.కోర మీసాల వీరభద్రుడు కాబట్టే సమాజాన్ని నాశనం చేయాలనుకునేవాళ్ల భరతం పడతాడని పేర్కొన్నారు. చెడు ఆలోచనలు ఉన్న వాళ్లలో మార్పు తీసుకొచ్చే స్వామి వీరభద్రుడు అని గుర్తు చేశారు. దేశం సుభిక్షంగా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు ఆయనతో పాటు ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఆలయ ఈవో కిషన్ రావు, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073